క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమి పూజ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలోని ఎర్ర చెరువు వద్ద బుధవారం ఎన్విరాన్‌మెంటలిస్ట్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఈఎఫ్ఐ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఎర్ర చెరువు కట్టను పటిష్టం చేయడం, మొక్కలు నాటడం, ఫెన్సింగ్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేస్తామని సర్పంచ్ దేవగిరి సుజాత తెలిపారు. ఈఎఫ్ఐ ఫౌండర్ అరుణ్ కృష్ణమూర్తి, సభ్యులు శంకర్, అజయ్ శశాంగన్, ఉపసర్పంచ్ ఎం. స్వప్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవగిరి ఓంకార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెన్న కేశవరావు పాల్గొన్నారు.

శ్మశానం అభివృద్ధికి రూ.50 వేల వితరణ



గన్నవరం: మండలంలోని అల్లాపురం, దావాజిగూడెం గ్రామాల ఉమ్మడి శ్మశానవాటిక అభివృద్ధికి ఆత్కూరుకు చెందిన అట్లూరి పూర్ణచంద్రరావు రూ.50 వేల విరాళం ఇచ్చారు. ఈ మేరకు బుధవారం శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు కారంపూడి గాంధీ, గొంది పరంధామయ్య, గుర్రం నరసయ్యకు ఆయన నగదు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఒకప్పుడు పిచ్చి మొక్కలు, ముళ్లకంచెలతో నిండిపోయిన శ్మశాన వాటికను ప్రభుత్వం, దాతల సహకారంతో సర్వంగా సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఈ అభివృద్ధి పనులకుగాను ఇప్పటి వరకు జెడ్పీ నిధులు, దాతలు ఇచ్చిన విరాళాలు కలిపి రూ.కోటి వెచ్చించామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మండల పరిషత్ సహకారంతో రహదారుల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకొస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సౌజన్యంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని సర్పంచ్ సోమయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదచారులు, ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

7 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని 45 అడుగుల ఎత్తయిన హనుమాన్ విగ్రహం వద్ద, దాసాంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కార్యసిద్ధి హనుమాన్ భక్త బృందం (ఏలూరు) సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఏడు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైస్ మిల్లర్లు తక్షణమే రైతులకు నగదు చెల్లించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ధాన్యం సరఫరా చేసిన రైతులకు తక్షణమే రైస్‌మిల్లర్లు సొమ్ము చెల్లించాలని గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి ఆదేశించారు. బాపులపాడు మండలం కాకులపాడులోని రైస్‌మిల్లులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. రైస్‌మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసిన రైతులు, వారికి ఎంత మొత్తం చెల్లించాలి అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాలయాపన చేయకుండా రైతులకు వెంటనే నగదు చెల్లించాలని ఆదేశించారు. లేనిపక్షంలో రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- కాసరనేనివారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కాసరనేనివారిపాలెంలో సంక్షేమ పాలన గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు:మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కాసరనేనివారిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించి, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. పలువురు స్థానికులు ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలంటూ ఎమ్మెల్యే పార్థసారథికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరిస్తూ మౌలిక వసతులను కల్పిస్తుందని తెలిపారు. అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలను అందిస్తూ ఆయా వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. పాలనలో పారదర్శకత తీసుకొచ్చిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు వంచన, అవస్థలు తప్ప మిగిలిందేమీ లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజల బ్యాంకు ఖాతాలకు నేరుగా సొమ్ము జమ చేస్తున్న ప్రభుత్వం తమదన్నారు. ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు మంచి జరుగుతుంటే చూసి ఓర్వలేకపోతున్నాయని ధ్వజమెత్తారు. అభూతకల్పనలతో ప్రజల్ని పక్కదారి పట్టించే యత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. వాస్తవాలను తెలుసుకుని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియాకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దు వరప్రసాద్, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు, మాజీ సర్పంచ్ అంబటిపూడి డేవిడ్, నాయకులు జడా రవి, బోరుగడ్డ కుమార్, బోరుగడ్డ శ్రీనివాసరావు, బుల్లా వెంకటరత్నం, ఎస్. నరేష్, రెబ్బా రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు టవళ్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు టవళ్లు అందజేస్తున్న సర్పంచ్ శీలం రంగారావు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న 52 మంది పారిశుద్ధ్య కార్మికులు బుధవారం శ్రీ వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో టవళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించారని గుర్తు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. ఇటువంటి వారి సేవలను గుర్తిస్తూ గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. శ్రీ వాసవీ సేవా సంఘం అధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు, సభ్యులు శికాకొల్లి యలమందయ్య, కోటా రామకృష్ణారావు, ఉడిమి సుబ్రహ్మణ్యం, ఉటుకూరి సాయి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

తుదిదశకు మద్దూరు సచివాలయం



ప్రారంభానికి సిద్ధమవుతున్న మద్దూరు గ్రామ సచివాలయం

కంకిపాడు: సచివాలయ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. భవనాన్ని ప్రారంభించేందుకు చురుగ్గా పనులు సాగుతున్నాయి. మండలంలోని మద్దూరు గ్రామంలో యలమంచిలి స్నేహలత, రామారావు వితరణగా ఇచ్చిన స్థలంలో పంచాయతీ కార్యాలయం నడుస్తోంది. భవనం శిథిలావస్థకు చేరుకోవటంతో నూతన భవన నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగానే సచివాలయం మంజూరు చేసింది. రూ.40 లక్షలు అంచనా వ్యయంతో భవన నిర్మాణ పనులకు అనుమతులు ఇవ్వటంతో పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక పర్యవేక్షణలో నిర్మాణ పనులు చేపట్టారు. భవనం నిర్మాణం యావత్తూ పూర్తయ్యింది. విద్యుదీకరణ పూర్తి చేశారు. కార్యాలయ ప్రాంగణం ఫ్లోరింగ్, కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులను పూర్తి చేసి నెలాఖరు నాటికి భవనాన్ని ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. సచివాలయ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది అద్దె భవనం నుంచే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిత్యం అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తున్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ చిప్పల రామదాసు 'సాక్షి'తో మాట్లాడుతూ దాతలు సమకూర్చిన స్థలంలో అధునాతన హంగులతో సచివాలయ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పనులు దాదాపుగా పూర్తయ్యాయన్నారు. అతి త్వరలో భవనాన్ని ప్రారంభించి ప్రజలకు మెరుగైన సేవలు సమర్థంగా అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే పేదలకు మేలు



పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గన్నవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదలకు మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలోని గొల్లనపల్లి గ్రామంలోని ఆర్ఎస్ నంబరు 88లో 136 మంది పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు, 11 మంది పట్టాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ.. గొల్లనపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములు కొంత మంది ఆక్రమణలో ఉండటంతో పేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేసేందుకు సమయం పట్టిందన్నారు. గతంలో కేటాయించిన స్థలాల్లో గృహ నిర్మాణాలు జరగని కారణంగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించి పక్కా ఇళ్లు నిర్మించుకునేలా ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. పేదల సొంత ఇంటి కల సాకారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పడమట సురేష్, మండల కన్వీనర్ నీలం ప్రవీణ్‌కుమార్, గొల్లనపల్లి సర్పంచ్ ప్రశాంతి, శివ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, ఎంపీపీ రాజ్యలక్ష్మి తదితరులు

కంకిపాడు:అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని కాసరనేనివారిపాలెంలో రూ.5 లక్షలు మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న అంతర్గత రహదారి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవాలని సూచించారు. అభివృద్ధి విషయంలో అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. శాఖలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దు వరప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్మృతివనం పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహం పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీలేకుండా నిర్మాణం చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం స్మృతివనం నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఆయన అధికారులుకు పలు సూచనలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో, మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయన్నారు. వేసవి కావడంతో వెల్డింగ్ పనులు రాత్రి వేళల్లో నిర్వహించాలని సూచించారు.

వాహనాల అప్పగింతకు చర్యలు

ఉంగుటూరు: ఆత్కూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎళ్లతరబడి ఉన్న వాహనాలను వాటి యజమానులకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల యజమానులకు అందజేసే కార్యక్రమాన్ని పోలీసులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రమాద కేసులు, వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు చూపని వాహనాలతో స్టేషన్ ఆవరణ అంత నిండిపోవడంతో ఇబ్బందికరంగా మారిందన్నారు. దీంతో వాటిని యజమానులకు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వాహనాల యజమానులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను చూపి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. రోడ్డు ప్రమాద కేసుల్లో వాహనాలు వదిలేసిన వారికి ఫోన్ చేసి మరీ సమాచారం ఇస్తున్నామని పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు

పెనమలూరు: కుటుంబ తగాదాల కారణంగా కానూరులోని ఓ ఇంట్లోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి దాడి చేసిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సనత్‌నగర్‌లో బిట్రా సక్కుబాయి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. అయితే గత మార్చి 21వ తేదీన ఆమె రెండవ కోడలు సహజ మృతి చెందంతో అత్తింటివారి పై కేసు నమోదు చేశారు. కాగా మనుమరాలు సక్కుబాయి వద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో సహజ తల్లిదండ్రులు మసనం భారతి, మసనం వేణుగోపాల్, సంజయ్‌కుమార్, రామకృష్ణ, లక్ష్మి మరి కొందరు సక్కుబాయి ఇంటికి వచ్చి ఆమెతో పాటు కుటుంబ సభ్యుల పై దాడి చేశారు. ఈ ఘటన పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రెసిడెన్షియల్ స్కూల్లో మైనార్టీ బాలికలకు ప్రవేశం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ భవానీపురంలోని రెసిడెన్షియల్ స్కూల్‌లో 5, 6, 7, 8 తరగతుల్లో మైనార్టీ విద్యార్థినులకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్లు ఇస్తామని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్(మైనార్టీ గరల్స్) భవానీపురం ప్రిన్సిపాల్ జి.ఎమిలి కాంతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఆసక్తి గల మైనార్టీ విద్యార్థినులు(ముస్లింలు, బీసీ(సీ) క్రిస్టియన్లు) మరిన్ని వివరాలకు 89783 44949 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సుందరయ్య జీవితం ఆదర్శనీయం



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాబూరావు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నేటి యువతరానికి దక్షిణ భారత ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. సీపీఎం అఖిత భారత తొలి ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి కార్యక్రమాలు సింగ్‌నగర్, వడ్డెరకాలనీ, ఉడాకాలనీ, శాంతినగర్, కండ్రి ప్రాంతాల్లో బుధవారం ప్రారంభమయ్యాయి. వీటికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ముందుగా సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప నాయకుడు సుందరయ్య అన్నారు. తెలుగు గడ్డపై పుట్టి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ నెల 19వ తేదీ వరకు ఆ మహనీయుడి జయంతి వేడుకలను జరిపి, అదే రోజు లెనిన్‌సెంటర్‌లో బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. సీపీఎం నాయకులు కె.శ్రీదేవి, బి.రమణారావు, కె.దుర్గారావు, సీహెచ్ శ్రీనివాస్, జి.ఝాన్సీ, వెంకటరెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి



కంకిపాడు శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్న గోవిందరావు



తెన్నేరు శాఖా గ్రంథాలయంలో క్రాఫ్ట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంకిపాడు:ఆంగ్లంపై పట్టు సాధించాలని విశ్రాంత ఎంఈఓ వంగల గోవిందరావు అన్నారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఎంఈఓ గోవిందరావు ఆంగ్లంపై పట్టు సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష్ టిప్స్ తెలిపారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం విద్యార్థులకు క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

ట్రాఫిక్ పోలీసులకు వేసవి కిట్ల పంపిణీ



సిబ్బందికి కిట్లను పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ రామారావు

పటమట(విజయవాడతూర్పు): వేసవిలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాఫిక్ సీఐ యు.రామారావు సూచించారు. ఏడీసీపీ సర్కార్, ఏసీపీ సురేష్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో బుధవారం పటమట ఎన్టీఆర్ సర్కిల్ వద్ద, రామవరప్పాడు రింగ్ వద్ద నాలుగో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ యు.రామారావు ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు, హోంగార్డులకు సమ్మర్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు మాట్లాడుతూ.. వాతావరణంలో పెరుగుతున్న ఉష్ణోగ్రత కారణంగా పోలీసు సిబ్బంది అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని, అందరూ జాతీయ రహదారిపై నిత్యం వీఐపీలు సంచరించే ఈ మార్గంలో సిబ్బంది ఎండల్లోనే విధులు నిర్వహించాల్సి వస్తుందన్నారు. మూడు రోజులుగా ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది అస్వస్థతకు గురవ్వకుండా తాము కిట్లు అందిస్తున్నామని, స్టేషన్ పరిధిలోని 60 మంది సిబ్బంది కిట్లు అందిచామని చెప్పారు. ఎండలోనే రోడ్డుపై విధులు నిర్వహించాల్సిన ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్లద్దాలు, తాగునీటి బాటిల్, గ్లూకోజ్ ప్యాకెట్, ఓఆర్ఎస్‌లను సమ్మర్ కిట్లుగా అందిస్తున్నామన్నారు. కిట్లను పోలీసు సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పోరంకిలో కమిషనర్ ప్రకాశరావుకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘ నేతలు కోరారు. ఈ మేరకు కమిషనర్ ఎన్.ప్రకాశరావుకు బుధవారం వినతి పత్రం అందచేశారు. అనంతరం సమస్యల వివరాలు తెలుపుతూ వివిధ విభాగాల్లో దాదాపు 450 మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. అయితే జీతంలో ఈఎస్ఐ, పీఎఫ్ కింద సొమ్ము మినహాయిస్తున్నా, గుర్తింపు కార్డు కాని, వివరాలతో ఉన్న స్లిప్ ఇవ్వటం లేదన్నారు. పెంచిన జీతంలో రూ.ఆరు వేలు ఇవ్వటంలేదని, కార్మికులకు ఇవ్వాల్సిన దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు ఇవ్వలేదని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు గత ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు దాటిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్మికులందరికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని విన్నవించారు. వినతిపత్రం అందచేసిన వారిలో వైఎస్సార్ సీపీ నేత, కానూరు మాజీ సర్పంచ్ అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, సీపీఎం నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్. కాశిం, ఉద్యోగ సంఘ నేతలు ఆర్.సింహాచలం, వై.సరళ, ఎం.కొండలరావు, దుర్గారావు, సీహెచ్.సురేష్ పలువరు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు(ఏపీపీసీబీ), రైల్వే హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో «మిషన్ లైఫ్» అనే పేరుతో రైల్వే మినీ స్టేడియం నుంచి పర్యావరణ పరిరక్షణపై అవగాహన సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీసీబీ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ టి.ప్రసాదరావు పాల్గొని మిషన్ లైఫ్ పేరుతో సేవ్ ఎనర్జీ–కన్జర్వ్ వాటర్ అనే అంశంపై అవగాహన కల్పించి పర్యావరణ అనుకూలమైన పద్ధతులను ఎంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పేపర్ వాడుకను వీలైనంత తగ్గించుకోవాలని, కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ వినియోగించాలని, సోలార్ విద్యుత్ వాడకం, ఎల్ఈడీ బల్బుల వాడకం, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజల్లో అవగాహన తీసుకురావటమే ఈ మిషన్ లైఫ్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమాన్ని జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ రవికాంత్ పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

యోగా జీవన విధానం కావాలి

గన్నవరం రూరల్: యోగా భారతీయ జీవన విధానమని, దానిని విద్యార్థులు నేర్చుకోవాలని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి సూచించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం పుస్తక పఠనం, చిత్రలేఖనం, యోగా పోటీలు నిర్వహించారు.